క్లుప్తంగా

బోద వ్యాధిగ్రస్తులకు వెస్టన్ టైప్ కమోడ్స్ అందజేత

పెడన: బోద వ్యాధిగ్రస్తులకు వెస్టన్ టైప్ కమోడ్స్ అందజేయడం అభినందనీయమని, అటువంటి వారి బాధలను అర్థం చేసుకుని, వారి ఆరోగ్యం మరింత కుదటపడాలనే లక్ష్యం, ఆశయం చాలా మంచిదని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మాన్‌కైండ్ ఫార్మా వారి సహకారంతో లెప్రా సొసైటీ ద్వారా పెడన మండలంలోని పది మంది బోద వ్యాధిగ్రస్తులకు వెస్టన్ టైప్ కమోడ్స్ అందజేశారు. లెప్రా సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ తమ సంస్థ మాన్ కైండ్ ఫార్మా వారి సహకారంతో ఒక్కొక్కటి రూ.3వేల ఖరీదు చేసే 30 వెస్టన్ టైప్ కమోడ్స్‌ను బోద వ్యాధిగ్రస్తులకు జిల్లా వ్యాప్తంగా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ఓఆర్‌డబ్ల్యూ నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఉపాధి పనుల గుర్తింపు

కృత్తివెన్ను: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసే ప్రతి పని గ్రామ సభ ద్వారా ఆమోదం పొందాలని ఎంపీడీవో వరుదు రాంబాబు అన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించారు. ఈ సభలలో పాల్గొన్న ఎంపీడీవో రాంబాబు, ఎంపీపీ గరుడప్రసాద్ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా సీసీరోడ్లు, పక్కా సీసీ డ్రైన్‌లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు శుక్రవారం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘ నాయకులు బి.సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, ఉయ్యూరు, పామర్రు, గూడూరు, అవనిగడ్డ, ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదన్నారు. జీతాలు అందకపోవటంతో కార్మికులు పచారీ సరుకుల కొనుగోలుకు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సామూహిక లక్ష్మీ అష్టోత్తర పఠనం

మచిలీపట్నంటౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని మాస్టర్ ఈ.కె. బాలభాను విద్యాలయంలోని శ్రీ కోదండరామస్వామి మందిరంలో విద్యార్థినిలు సామూహిక లక్ష్మీ అష్టోత్తరం పఠించారు. లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, పండుగలకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థినిలకు వివరించారు.

టైలరింగ్, మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: స్థానిక పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ పట్టాభి గ్రామీణాభివృద్ధి సంస్థలో త్వరలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గం వర్క్స్‌లో శిక్షణకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.గోపీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు మధ్య ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 93907 74782 నంబరును సంప్రదించాలన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం

మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలో ఉన్న చిట్టిపిల్లారయ్య స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

7 నుంచి గణపతి నవరాత్రోత్సవాలు

సెప్టెంబరు 7 నుంచి 16వ తేదీ వరకు చిట్టిపిల్లారయ్య ఆలయంలో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భక్తబృందం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో ఉన్న శ్రీ రంగనాయక స్వామివారి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో నగరానికి చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమములో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ నేల సంధ్య పాల్గొని శ్రీ అమ్మవారి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. అనంతరం పూజలో పాల్గొన్న ముత్తయిదువులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

అలారం సిస్టం..సీసీ కెమెరాలు ఉండాలి



వైద్యుల రక్షణ పరంగా పెద్ద పెద్ద ఆసుపత్రులలో లాక్ సిస్టం ఉండాలి. అలాగే అలారం, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూస్తుండాలి. ఇటువంటి అకృత్యాలకు పాల్పడిన వారిని బహిరంగంగా తక్షణం శిక్షించాలి.

– డాక్టర్ మీర్ పర్వేజ్ హైదర్ బాకరీ, పెడన పీహెచ్‌సీ



వైద్యులపై దాడి చేస్తే కఠిన చర్యలు చేపట్టాలి



విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై, పోలీసులపై దాడి చేస్తే కఠిన చర్యలు అమలు చేస్తున్నారు. కాని వైద్య వృత్తిలో ఉన్న వారిపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇటువంటివి పునరావృతం కాకుండా రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలి.

– డాక్టర్ కె మీనాదేవి, పెడన పీహెచ్‌సీ వైద్యురాలు

కోల్‌కతా ఘటనకు నిరసనగా ర్యాలీ



బంటుమిల్లి అంబేడ్కర్ సెంటర్లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు

బంటుమిల్లి: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టరును అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేసి స్థానిక అంబేడ్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పి.ధనశ్రీ మాట్లాడుతూ దేశంలో అర్ధరాత్రి మహిళ ఒంటరిగా తిరిగినప్పుడే గాంధీ కలలు కన్న స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు. సీపీఎం, రైతు సంఘ నాయకులు నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అజయ్‌ఘోష్, బి.నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక రాజుపేటలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత మాట్లాడుతూ ప్రాణం పోసే వైద్యులకే భద్రత కరువైందన్నారు. దేశంలో మహిళల రక్షణకు చట్టాలు ఉన్నా పటిష్టంగా అమలు చేయకపోవటం వల్ల మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ప్రజలందరూ ఖండించాలన్నారు. దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు గ్రామసభలు

చల్లపల్లి గ్రామసభలో జిల్లా కలెక్టర్ బాలాజీ



చల్లపల్లిలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



బంటుమిల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు, పక్కన కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి(అవనిగడ్డ): ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు గ్రామసభ దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం మన పంచాయతీ – మన సాధికారత గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్, విద్యుత్ కనెక్షన్, తాగునీటి కుళాయి కనెక్షన్, ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, లింకు రోడ్ల నిర్మాణం, పూర్తిస్థాయిలో వీధిలైట్ల ఏర్పాటు ప్రధాన లక్ష్యాలుగా ఉపాధి హామీ పథకం నిధులు వినియోగిస్తున్నట్టు చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, రైతులకు ఉద్యాన తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్టు తెలిపారు. చల్లపల్లిని ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సభలో అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చల్లపలి మండలానికి రూ.3కోట్లు, చల్లపల్లి గ్రామానికి రూ.2.60 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి కేంద్ర ప్రభుత్వ సత్కారం అందుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిని కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, జనసేన యువనేత మండలి వెంకట్రామ్(రాజా), ఎంపీపీ కోట విజయరాధిక, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీవైఈవో జ్యోతిర్మయి, తహసీల్దార్ వనజాక్షి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీపీ చినరాట్నాలు, సీఐ కె.ఈశ్వరరావుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం నిధులతో గ్రామాల అభివృద్ధి

బంటుమిల్లి: ఉపాధి హామీ పథకం ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్య పడుతుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు అన్నారు. ఉపాధి హామీ పథకం గ్రామ సభల కార్యక్రమంలో భాగంగా బంటుమిల్లి-1 సచివాలయం వద్ద సర్పంచ్ వెంట్రప్రగడ కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కాగితతో పాటు జిల్లా కలెక్టరు డీకే బాలాజీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అంచనాలతో తాగునీరు, అంతర్గత డ్రైనేజి, సీసీ రోడ్లు తదితర సౌకర్యాల ఏర్పాటుకు అంచనాలు ఈ గ్రామ సభల్లో తీర్మానించి ఆమోదిస్తామన్నారు. జిల్లా కలెక్టరు డీకే బాలాజీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనుల వద్ద ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఏర్పాటు చేసిన సౌకర్యాలను వివరించారు. సభలో మాజీ జెడ్పీటీసీ డి.కరుణ, సీపీఎం నాయకుడు ఎల్.అజయ్‌ఘోష్, జనసేన నాయకుడు ఎస్.సతీష్, పలు రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎంపీడీఓ స్వర్ణభారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్గత డ్రైనేజీ, తాగునీరు, డంపింగ్‌యార్డు సమస్యలను ప్రజలు కలెక్టరు దృష్టికి తెచ్చారు. తొలుత కలెక్టరు, ఎమ్మెల్యేలు మహాత్మాగాంధీ, ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ గ్రామ సభల్లో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘంటసాలలో ఉపాధి హామీ పథకం గ్రామ సభలు

ఘంటసాల: ఉపాధి హామీ పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఘంటసాల, చినకళ్లేపల్లి, తెలుగురావుపాలెం, ఘంటసాలపాలెం పంచాయతీల్లో సర్పంచ్‌లు బి.వెంకటేశ్వరమ్మ, జి.రామారావు, రాచూరి ప్రసాద్ బాబు, దోనె రజని అధ్యక్షతన జరిగాయి. ఆయా గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు కల్పిస్తున్న పనులు, రైతులకు అందిస్తున్న సేవలు, ఆర్థికాభివృద్ధికి ఇస్తున్న పథకాల గురించి సంబంధిత శాఖాధికారులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ జె.నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.కిషోర్, ఏపీవో ఎస్.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల వద్ద ప్రత్యేక గ్రామసభలు

కోడూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరిస్తూ శుక్రవారం పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. కోడూరు-1 సచివాలయం వద్ద నిర్వహించిన సభలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, సర్పంచి వెన్నా షైనీ పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని జెడ్పీటీసీ కోరారు. రహదారులు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పథకానికి సంబంధించిన సిటిజన్ నాలెడ్జ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఉల్లిపాలెం, హంసలదీవి, లింగారెడ్డిపాలెం, పోటుమీద, మందపాకల, రామకృష్ణాపురం, జయపురం, వి.కొత్తపాలెం, మాచవరం, విశ్వనాథపల్లి, సాలెంపాలెం, పిట్టల్లంక పంచాయతీ కార్యాలయాల వద్ద కూడా గ్రామసభలు జరిగాయి. ముందుగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శులు ఉదయలక్ష్మి, సుధీర్, ఏడుకొండలు, నాగార్జున, లీలాప్రియాంక, ఓంకారం, తనూజ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై గళం విప్పిన ప్రజానీకం

గూడూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు గుర్తించడానికి శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ప్రజలు పలు సమస్యలపై తమ గళం వినిపించారు. మండల కేంద్రమైన గూడూరులో నిర్వహించిన గ్రామసభలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, తహసీల్దారు డి.రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు మురుగునీటిని రోడ్లపైకి వదిలేస్తున్నారని పోతన రంగా అనే వ్యక్తి గ్రామసభలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయం ముందే మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మాజీ సర్పంచి పోతన రామోజీ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించినా ఇప్పటికీ కొందరు రోడ్ల వెంబడి బహిర్భూమికి వెళుతున్నారని, దీనిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గత పదిహేను రోజుల నుంచి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు మురికిగా వస్తున్నాయని బవిరెడ్డి నాగ ఫిర్యాదు చేశారు. గ్రామసభల్లో వచ్చిన సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. తరకటూరులో జరిగిన గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు వంటి ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని గ్రామ సభల్లో చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, మాజీ డీసీ చైర్మన్ పోతన లక్ష్మీ నరసింహస్వామి, ఏఓ జి.వి.శివ ప్రసాద్ తదితరులు పల్గొన్నారు.

పనులకు రాకుండా వేతనాలు డ్రా చేస్తున్నారు

పూర్తి విచారణ చేపట్టాలన్న గ్రామస్తులు



నడుపూరు గ్రామ సభలో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు, గ్రామస్తులు

పెడన: ఉపాధి హామీ పనులకు రాకుండానే వచ్చినట్లుగా హాజరు వేసి వేతనాలు డ్రా చేస్తున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని గ్రామస్తులు, ఎన్డీయే కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా శుక్రవారం గ్రామ సభలు ఆయా గ్రామ పంచాయతీలలోని గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించారు. నడుపూరు గ్రామ పంచాయతీ వద్ద జరిగిన సభలో పలువురు గ్రామస్తులు పనులకు రాకుండా వేతనాలు డ్రా చేస్తున్నారని సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈవోపీఆర్డీ జయరామ్ మాట్లాడుతూ ఫిర్యాదులకు ఇది వేదిక కాదని, అందుకు సోషల్ ఆడిట్ ప్రత్యేకంగా ఉంటుందని, ఆ సమయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చీర్ల అనూష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

– గ్రామ సభ వద్ద 2023 ఏప్రిల్ నాలుగో తేదీన పనులు ప్రారంభించి అక్టోబరు 25, 2023నాటికి ఆ పనులు పూర్తి చేసినట్లుగా బోర్డులు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు ఇప్పుడు తాజాగా బోర్డులు పెట్టడం ఏమిటంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నించారు.

– మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హాజరయ్యారు. బల్లిపర్రు గ్రామంలో సీసీ రోడ్లు, వివిధ పనుల నిర్మాణానికి రూ.29 లక్షలు కేటాయించినట్లు తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, తహసీల్దారు అబ్దుల్ రహమాన్ మస్తానా, ఎంపీడీవో రెడ్డయ్య, ఎన్డీయే కూటమి స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాయల ఉద్యోగులు పాల్గొన్నారు.

– మండలంలోని 24 పంచాయతీలలో జరిగిన గ్రామసభలను ఎంపీడీవో వి.రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరామ్, గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ సీహెచ్ స్రవంతి, ఎంఈవో-2 హరనాథ్, ఏపీవో వజీర్, వెలుగు ఏపీఎం శ్రీదేవి పర్యవేక్షించారు. ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు అన్నారు. నగరంలోని 45వ డివిజన్‌లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ పనులను ప్రారంభించిన ఆయన చీపురుపట్టి రోడ్లను ఊడ్చారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగానే నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు. నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణికుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

కృత్తివెన్ను: వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని సస్యరక్షణ చర్యలు తీసుకోవడంలో ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని పొలంబడి కార్యక్రమంలో ఏవో జెన్నీ రైతులకు చెప్పారు. పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో నిర్వహించారు. పంటపొలాలను తెగుళ్ల నుంచి చాలా వరకు రక్షించుకోవడంలో బంతి మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పొలం గట్ల వెంబడి బంతిమొక్కలు నాటడం వల్ల పురుగులు వరిని తక్కువగా ఆశిస్తాయన్నారు. రైతులకు బంతి నారును ఏవో అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేష్, అఖిల్ రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామ కృష్ణయ్య అన్నారు. స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగేటప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేస్తే వాటిని నియంత్రించవచ్చునన్నారు. సదస్సులో ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాససింగ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, న్యాయవాది అజ్జు తున్నీసా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీఎం రాణి పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఒర్లగొందితిప్ప గ్రామంలో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసి 12 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ.1110 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. నాటుసారా తయారీ, రవాణా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్టపరంగా తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

ఘంటసాల: రైతుల నుంచి నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటి తీరువా వసూళ్లపై మండల వీఆర్వోలు, సర్వేయర్లతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో సుమారు రూ.1.46 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.25 లక్షలు మాత్రమే వసూలయ్యాయని, వీఆర్వోలు, సర్వేయర్లు రైతులతో మాట్లాడి నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. మండలంలోని రైతులు కూడా రెవెన్యూ సిబ్బందికి సహకరించి నీటి తీరువా వసూళ్లకు సహకరించి సకాలంలో నగదు చెల్లించాలని తహసీల్దార్ విజయప్రసాద్ కోరారు. సమావేశంలో డీటీ చప్పిడి చిట్టిబాబు, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో స్వచ్ఛ భారత్

ఘంటసాల: స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ నిర్వహిస్తే పరిశుభ్రమైన భారతావనిని రూపొందించవచ్చునని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ స్వచ్ఛ పక్షోత్సవాల్లో భాగంగా కేవీకే ప్రాంగణంలో కలుపు మొక్కలను తొలగించామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ రేవతి, డాక్టర్ నవీన్, యశ్వంత్ కుమార్, కృష్ణవేణి, సామాజిక విజ్ఞాన శాస్త్రం కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

మచిలీపట్నంటౌన్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో త్రిపుర సుందరి ఫౌండేషన్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు వేమూరి రామకృష్ణారావు, వింజమూరి శివరామ్, పీవీ ఫణికుమార్, మోపర్తి సుబ్రహ్మణ్యం, పీఎస్ఎస్ ఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతి జాబ్ కార్డుకు పని కల్పించాలి

మోపిదేవి: ఉపాధి హామీ పథకంలో ప్రతి జాబ్‌కార్డుకు పని కల్పించాలని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించారు. అందులో భాగంగా మోపిదేవిలో ప్రత్యేక అధికారి తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 9 సీసీ రోడ్లకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఉప సర్పంచ్ కోనేరు సుందరసింగ్, ఎంపీటీసీ కొమ్ము పవన్, ఫెసిలిటేటర్లు, మేట్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీడీఎస్‌వై స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంటౌన్: దీన్‌దయాళ్ స్పర్శ యోజన పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లు పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబరు 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కత్తి ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఫిలాటరీ స్కాలర్‌షిప్ ద్వారా ఒక్కొక్క విద్యార్థికి ప్రతి నెల రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు అందిస్తారన్నారు. 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష నిర్వహించి 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్ షిప్ అందిస్తారని, విద్యార్థులు వారి దరఖాస్తులను స్పీడ్ పోస్టులో పోస్టుమాస్టర్ జనరల్, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం- 520003 కు పంపాలన్నారు.

చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కలెక్టర్



చల్లపల్లి వైద్యశాలలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌తో కలసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. ఈసీజీ, అల్ట్రా స్కానింగ్ విభాగం, డెంటల్, ల్యాబ్, రక్తపరీక్షల విభాగం, బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ని పరిశీలించారు. అందుబాటులో ఉన్న పరికరాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గైనకాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉండటాన్ని గమనించి వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యశాల పరిశుభ్రత, చికిత్స పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ (రాజా), డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బీఎస్ఆర్ శ్రీనివాస్, ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీవో చినరాట్నాలు, తహసీల్దార్ వనజాక్షి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయ్యారి భామ మొక్కలతో అప్రమత్తం

ఘంటసాల: వయ్యారి భామ కలుపు మొక్కలతో అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత శుక్రవారం తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఆమె మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన వారోత్సవాలలో భాగంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధన కేంద్రాల పరిధిలోని వివిధ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వయ్యారిభామ మొక్కల వలన వివిధ రకాలైన చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు కలుగుతాయని, వీటి వలన వచ్చే దుష్ప్రభావాలను, మొక్కల నిర్మూలన గురించి రైతులకు వివరించారు. ఈ మొక్కల వలన పంటలు, పశుగ్రాసం దిగుబడి తగ్గుతుందన్నారు. దీని నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, ఆవశ్యకతను డాక్టర్ శ్రీలత వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, యశ్వంత్ కుమార్, డాక్టర్ రేవతి, జి.కృష్ణవేణి, డాక్టర్ నవీన్, రైతులు, రావ్ వే విద్యార్థులు పాల్గొన్నారు.